

‘ట్రాఫిక్’పై అవగాహన

పెద్దపల్లిరూరల్: వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలని ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు సూచించారు.



లింక్ కెనాల్ పరిశీలన

ధర్మారం: నందిమేడారం శివారులో చేపట్టిన లింక్ కెనాల్ పనులను కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
30.6/15.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

స్తంభించిన పాలన

- వత్తాలేని కౌన్సిల్ సమావేశాలు
- మూడు నెలలుగా ఇదే దుస్థితి
- సమస్యలతో నగరవాసుల సతమతం
- పాలకవర్గం ఉన్నట్లా.. లేనట్లా అనే అనుమానం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పాలక వర్గంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజాపాలన వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. అసలు పాలకవర్గం ఉన్నట్లా, లేనట్లా అనే గందరగోళం నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో నిలిచిన కౌన్సిల్ సమావేశాలు.. ఎన్నికలు పూర్తయి రెండు నెలలు కావస్తున్నా ఒక్క సమావేశం నిర్వహించలేదు. ఎప్పుడు నిర్వహిస్తారో కూడా తెలియని అయోమయం ఏర్పడింది.

మూడు నెలలు గడిచినా..

గతేడాది అక్టోబర్ 5న రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మళ్లీ ఇప్పటి వరకు బల్దియా పాలకవర్గం సమావేశం కాలేదు. తద్వారా పరిపాలన అనుమతులు లేక అభివృద్ధి పనుల ప్రారంభంలో ప్రతిష్టంభన ఏర్పడింది. పూర్తయిన బిల్లులు మంజూరు కావడంలేదు.

అవిశ్వాసమే కారణమా?

- కొందరు కార్పొరేటర్లు సృష్టించిన అవిశ్వాస జ్వాలలే నగరపాలనలో ప్రతిష్టంభనకు కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.
- గత అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గంలో జరిగిన కొన్ని పరిణామాల నేపథ్యంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు పదవులకు ఎసరొచ్చింది.
- పాలకవర్గంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లదే మెజారిటీ ఉన్నా.. అందరినీ ఏక తాటిపై నడిపించడంలో పార్టీ అధిష్టానం విఫలమైందనే విమర్శలు ఉన్నాయి.
- దీంతోనే కార్పొరేటర్లు తలోదిక్కు చెదిరిపోయారని అంటున్నారు.
- అసమ్మతి కార్పొరేటర్లు కొందరు అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన నాటి నుంచే అవిశ్వాస తీర్మానం ప్రక్రియ ప్రారంభించినా.. ఇంకా కొలిక్కి రాలేదు.



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లీకేజీలు అరికట్టడానికి తిరుమలనగర్ – ఎల్బీనగర్ మధ్య రోడ్డుపై ఆర్నెల్ల క్రితం తవ్వి వదిలేసిన పెద్దగొయ్యి ఇది. ఇప్పటికీ పనులు పూర్తిచేయలేదు. జనావాసాల్లోంచి విడుదలయ్యే మల, మూత్రాలు గొయ్యిలో నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది దాడులు చేయడంతో స్థానికులు ప్రాణాంతక వ్యాధుల బారినపడుతున్నారు. గొయ్యితో వాహనాల రాకపోలకూ అంతరాయం కలుగుతోంది. రాత్రివేళ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మూడు డివిజన్ల పరిధిలోకి వచ్చే ఈ జటిలమైన సమస్య పరిష్కరించే నాథుడే లేడు. రామగుండం నగర పాలన స్తంభించి పోవడానికి ఇదొక్క ఉదాహరణ చాలంటున్నారు స్థానికులు.

బడ్జెట్ సమావేశంతో సమ్యలే..

- మరో 15 రోజుల్లో బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆమోదించాల్సి ఉంది. అలా చేయకుంటే ఏప్రిల్ ఒకటో తేదీనుంచి ఒక్కపైసా కూడా కార్పొరేషన్ ఖాతా నుంచి వివిధ పనులకు ఖర్చు చేయడానికి వీలు ఉండదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇదే జరిగితే కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుతోపాటు నగరపాలక సంస్థలోని సుమారు 600 మంది కార్మికులకు వేతనాల చెల్లింపులు నిలిచిపోతాయి.

అధికారుల మల్లగుల్లాలు...

నగర మేయర్, పాలకవర్గ సభ్యుల మధ్య సమన్వయం ఉంటే పెండింగ్ అప్రూవల్స్ ద్వారా అత్యవసరమైన కొన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి అవకాశం ఉండేదని అంటున్నారు. కానీ అవిశ్వాస రాజకీయాలతో పెండింగ్ అప్రూవల్ ఇవ్వడానికి మేయర్ వెనుకాడుతున్నారని పేర్కొంటున్నారు. దీంతో అభివృద్ధి పనులు ఎలా చేపట్టాలో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం



రాష్ట్రంలోనే అత్యంధికంగా రామగుండం కార్పొరేషన్‌లో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాం. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల కోడ్, ప్రభుత్వం మారడం, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, నిధుల మంజూరు లేకపోవడంతో నిర్దేశిత గడువులో సమావేశాలు నిర్వహించలేదు. బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఇవి పూర్తయితే ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం. మేదరిబస్తీ, కల్యాణ్‌నగర్ రోడ్డు పనులకు రూ.40కోట్లు అవసరమని నివేదించాం. ఎమ్మెల్యే సహకారంతో తొలివిడతగా రూ.10కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– బంగి అనిల్ కుమార్, మేయర్, రామగుండం

ప్రజావాణి అర్జీలకు అధిక ప్రాధాన్యం

- తన కుమారుడు పోషణ గురించి పట్టించుకోవడం లేదని పెద్దపల్లి మండలం మూలసాల గ్రామానికి చెందిన సుదర్శన్ ఆవేదన వ్యక్తం చేశాడు.
- తప్పుడు హద్దులు చూపి రోడ్లు ఆక్రమించుకుంటున్నారని గోదావరిఖని పద్మావతికాలనీ, శారదానగర్‌కు చెందిన ఆలగం రమేశ్ అడిషనల్ కలెక్టర్‌కు ప్రజావాణిలో మొరపెట్టుకున్నాడు.
- పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు పంచాయతీలో రూ.1,79,018 దుర్వినియోగమయ్యాయని డీఎల్‌పీవో విచారణలో తేలిందని, ఆ నిధులు రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ఎంపీటీసీ మిట్టపల్లి వసంత, నాయకుడు వెంకటేశం అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఇలా సోమవారం కలెక్టరేట్‌లో చేపట్టిన ప్రజావాణి ద్వారా పలువురు అధికారులకు అర్జీలు అందజేశారు.



అధికారులకు విన్నవిస్తున్న అభాగ్యులు

- స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి వచ్చిన వారి నుంచి అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

పాలకుర్తి(రామగుండం): కన్నాల బోడగుట్టపై అక్రమ మైనింగ్, బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బామ్లానాయక్ తండా సర్పంచ్ బదావత్ రాజునాయక్ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారు.

ట్రైసైకిల్ ఇప్పించండి



ప్రభుత్వం నుంచి వచ్చే ట్రైసైకిల్ నాకు ఇప్పించాలని అధికారులను పలుమార్లు కలిసి వేడుకున్న. నాకు వైకల్యం ఉంది. నడిచేందుకు ఇబ్బందులు పడుతున్న. అధికారులు ట్రైసైకిల్ ఇచ్చి సహకరించాలి.

– సంపంగి రేణుక, జీడినగర్

చర్యలు తీసుకోండి



సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లిలో పరిశ్రమలు, ఫొటోషూట్ సంస్థలకు పంచాయతీ తీర్మానాలు లేకుండానే కార్యదర్శి అంజలి అనుమతులిచ్చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– అనిత, సర్పంచ్, బొంతకుంటపల్లి

భూమి ఆక్రమించారు



పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ శివారులోని సర్వే నంబరు 478/డిలో నుంచి 8గుంటలను అక్రమంగా పట్టా చేయించారని కల్వల శంకర్ ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని ఫ్లెక్సీతో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గతేడాది నవంబర్ 15న రామగుండం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని గుర్తుచేశారు.

న్యూస్‌రీల్

వందశాతం ఉత్తీర్ణత లక్ష్యం



పరిసరాలు పరిశీలిస్తున్న అరుణశ్రీ

జూలపల్లి(పెద్దపల్లి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఉపాధ్యాయులకు సూచించారు. పెద్దాపూర్ జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణ తీరుపై ఆమె ఆరా తీశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణలో విరివిగా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని కోరారు. ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంఈవో కవిత, ఎంపీవో కిరణ్, ప్రధానోపాధ్యాయురాలు రాగమయి పాల్గొన్నారు.

వార్షిక లక్ష్య సాధనకు కృషి



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రామగుండం: పట్టణంలోని బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో ప్రతీ ఉద్యోగి, ఇంజినీర్, కార్మికుడు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి నిర్దేశిత విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం సాధించాలని సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) పి.విజేందర్ సూచించారు. తన చాబర్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఈఈఏ), తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఈఏఈఏ) కొత్త డైరీ, క్యాలెండర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ రామగుండం బ్రాంచి సెక్రటరీ డి.రవికుమార్, ప్రతినిధులు భానుకిరణ్, సత్యనారాయణ, సామ్యూల్, ఖాజా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయించొద్దు



ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి(పెద్దపల్లి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనాథ్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రైవేట్ వ్యాపారులతోపాటు పీఏసీఎస్ గోదాముల్లో ఎరువుల నిల్వలు, రికార్డులను మండల వ్యవసాయాధికారి ప్రత్యూషతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో యూరియాకు కొరత లేదన్నారు. మండలంలో 94 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఏఈవో రాకేశ్ ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

రామగిరి(మంథని): మంథని జేఎన్టీయూలో ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో మెకానికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి వర్క్‌షాపు ప్రచార పోస్టర్‌ను సోమవారం ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. ‘క్వాడ్ కాప్టర్’ అంశంపై రెండురోజుల పాటు సదస్సు నిర్వహించనున్నారు. స్పేస్ చేంజ్ కంపెనీ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహిస్తారు. హాజరయ్యే విద్యార్థులు రూ.450 చెల్లించి ఈనెల 4వ తేదీలోగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ సలహాదారు పి.స్వప్న, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు బి.ఈశ్వర్, యు.హర్షిత, సింగారపు శివరామకృష్ణ, విద్యాసాగర్, మధు, శివకృష్ణ, అరుణ్, మెకానికల్ విభాగానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

మంథని: మంచిర్యాలలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన జపాన్ షిటోరియా కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ట్రెయినర్ కమిషన్ కావేటి సమ్మయ్య సోమవారం తెలిపారు. కటాస్, కుమితి విభాగాల్లో తాటి క్రిష్, విరాట్, బండారి మణికంఠ బంగారు, బెజ్జంకి అక్షయ, కీర్తన్, ఎండీ ఇక్ర వెండి పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను కాయ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్, వి.నరేందర్ అభినందించారు.

ఈఎస్ఐ సేవలు సద్వినియోగం చేసుకోండి

- రామగుండం నగర కమిషనర్ నాగేశ్వర్

కోల్‌సిటీ: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈఎస్ఐ) సేవలను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ నాగేశ్వర్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐ ఆధ్వర్యంలో నిధి ఆప్‌కే నికత్ 2.0 పేరిట సోమవారం అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడారు. నగరపాలక సంస్థలోని అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేస్తున్నామని తెలిపారు. ఈపీఎఫ్‌వో రీజినల్ కమిషనర్ తానయ్య సెల్వట్కార్ మాట్లాడుతూ.. బీమా, పింఛన్, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, అవసరాల కోసం రుణాలను ఈపీఎఫ్‌లో జమచేసిన నిధికి అనుగుణంగా మంజూరు చేస్తున్నామన్నారు. రామగుండం ఈఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ డి.ఖగేశ్వర్‌రావు ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ద్వారా కార్మికులకు అందిస్తున్న వైద్యం, బీమా తదితర సేవల గురించి వివరించారు. పలువురు కార్మికులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా.. హెల్ప్ డెస్క్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి సాధ్యమైన వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈపీఎఫ్‌వో అధికారులు మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటి, రామ్, నరేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వర్

సాంకేతికతను సద్వినియోగం చేసుకోండి

- కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య

గోదావరిఖని: అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతికతను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య కోరారు. ఆర్జీ–2 ఏరియా సిమ్‌టార్స్‌లో కంపెనీ స్థాయిలో ఎంపిక చేసిన 24మంది సర్వేయర్లకు ఆటోకాడ్ సివిల్ త్రీడీపై చేపట్టిన శిక్షణ తరగతులను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు వారాలపాటు సర్వేయర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. సంస్థ వందమిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం వైపు దూసుకుపోతున్న క్రమంలో భారీ ఉత్పత్తిని సాధించడానికి ఓపెన్‌కాస్ట్ గనులపై ఆధారపడి పని చేస్తున్నామని తెలిపారు. ఓపెన్‌కాస్ట్ గనుల లక్ష్యాల్లో ఆటోకాడ్ సివిల్ 3డి సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఉపయోగించడంతో ఆఫ్ లోడింగ్ వర్క్‌లో లోపాలను తగ్గించవచ్చన్నారు. ఇందుకోసం కచ్చితమైన సర్వే, లెక్కలు, డ్రాయింగ్‌లు, డిజైన్‌లు ఉపయోగిస్తారని వివరించారు. సంస్థ అనేక వ్యయప్రయాసలకోర్చి ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ, రీజియన్ సేఫ్టీ జీఎం గురువయ్య, కార్పొరేట్ సర్వే జీఎం పీకే రవి, సిమ్స్‌టార్స్ డీజీఎం శర్మ ఉన్నారు.



మాట్లాడుతున్న జీఎం గురువయ్య

అసెంబ్లీలో విగ్రహాల ఏర్పాటుకు సంతకాల సేకరణ

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు



సంతకాల ప్రతి చూపిస్తున్న పుట్ట మధు

మంథని: మహనీయులు మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను అసెంబ్లీలో ఏర్పాటు చేసేందుకు మంథని నియోజవర్గంలో సంతకాలు సేకరించి అసెంబ్లీ స్పీకర్‌కు అందజేయనున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు తెలిపారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో మహాత్మాజ్యోతిబా పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా మహనీయుల చరిత్ర ప్రజలకు తెలియనివ్వలేదని విమర్శించారు. ఈ దేశానికి చదువు నేర్పిన సరస్వతీదేవి సావిత్రీబాయి పూలే అని ఆయన కొనియాడారు. చదువుల కోసం ఈ దేశానికి ఎంతగానో కృషి చేసిన జ్యోతిబాపూలే, సావిత్రీయి పూలే విగ్రహాలను అసెంబ్లీలో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందన్నారు. కవిత ఆలోచనను తాము కూడా బలపరుస్తూ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులతో కలిసి సంతకాలు సేకరిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, నాయకులు తగరం శంకర్‌లాల్, కొట్టె రమేశ్, కాయిత సమ్మయ్య, ఏల్పుల గట్టయ్య పాల్గొన్నారు.

అప్పన్నపేట ‘విండో’ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- తీర్మానానికి మద్దతుగా 11మంది సభ్యుల హాజరు
- నేడు కొత్త చైర్మన్ ఎన్నిక

పెద్దపల్లిరూరల్: అప్పన్నపేట ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ దాసరి చంద్రారెడ్డిపై పాలకమండలి సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై సోమవారం జిల్లా సహకారశాఖ అధికారి శ్రీమాల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సొసైటీలో 13 మంది సభ్యులు ఉండగా చైర్మన్ చంద్రారెడ్డితోపాటు మరో డైరెక్టర్ అనారోగ్యంతో హాజరు కాలేదు. మిగతా 11మంది డైరెక్టర్లు హాజరై చంద్రారెడ్డిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా నిలిచారు. దీంతో విండో చైర్మన్ దాసరి చంద్రారెడ్డిపై అవిశ్వాసం నెగ్గినట్లు డీసీవో శ్రీమాల ప్రకటించారు. నూతన చైర్మన్ ఎన్నిక కోసం మంగళవారం అప్పన్నపేట సొసైటీలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం నాటి సమావేశంలో కొత్త చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తామని ఆమె వివరించారు.



సమావేశానికి హాజరైన డైరెక్టర్లు

ఏరియా అధికారుల సంఘం అధ్యక్షులు వీరే

- కార్పొరేట్ అధ్యక్ష స్థానానికి రీ పోలింగ్

గోదావరిఖని: సింగరేణిలో అధికారుల సంఘం ఎన్నికలు 30ఏళ్ల తర్వాత తొలిసారి ప్రశాంతంగా నిర్వహించారు. ఇవి రహస్య బ్యాలెట్ పద్ధతిన కొనసాగాయి. ఆదివారం సాయంత్రం నుంచి అర్ధ రాత్రి వరకు ఏరియాల వారీగా ఓట్లు లెక్కించారు. ఆదివారమే సింగరేణి స్థాయి అధికారుల సంఘం పూర్తి స్థాయి కమిటీని ప్రకటించారు. ఏరియా స్థాయిలో కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను సోమవారం వెల్లడించారు. కార్పొరేట్‌లో ఇద్దరికి సమానంగా ఓట్లు రావడంతో ఎన్నిక వాయిదా వేశారు. రీ పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో అక్కడి అధ్యక్షస్థానం ఫలితం ప్రకటించలేదు. ఏరియాల వారీగా ఎన్నికైన అధ్యక్షులు, కార్యదర్శుల వివరాలు..



కౌంటింగ్ కేంద్రం వద్ద అధికారులు

ఏరియా	అధ్యక్షుడు	కార్యదర్శి
కార్పొరేట్	రీపోలింగ్	రాపోలు కేశవరావు
కొత్తగూడెం	ఎస్.వెంకటాచారి	ఎ.ఉపేందర్‌బాబు
ఇల్లెందు	ఎ.గంగాధరశివప్రసాద్	కస్నూరి శ్రీనివాసరావు
మణుగూరు	కోడి కృష్ణమూర్తి	డి.శ్రీనివాసరావు
ఆర్జీ–1	బి.మల్లేశం	కోల మల్లేశం
ఆర్జీ–2	సుంకర మధుసూదన్	ఎ.వెంకటరాంరెడ్డి
ఆర్జీ–3	సీహెచ్ వెంకటరమణ	జి.శ్రీనివాసరావు
భూపాలపల్లి	టి.వెంకటరాంరెడ్డి	కె.రమేశ్
బెల్లంపల్లి	టి.మధుసూదన్	బి.వీరన్న
మందమర్రి	ఎస్.రమేశ్	పి.ఫైదీశ్వర్
శ్రీరాంపూర్	కె.వెంకటేశ్వర్‌రెడ్డి	చంద్రశేఖర్
ఎన్టీపీసీ	సముద్రాల శ్రీనివాస్	కె.సంతోష్‌కుమార్

వనదేవతల జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- వేగంగా ఏర్పాట్లు చేయండి
- అన్నివిభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ(రామగుండం)/గోదావరిఖని: వనదేవతల జాతరను ఘనంగా నిర్వహించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. గోదావరిఖని సమీపంలోని గోదావరి నదీతీర పుష్కర్ ఘాట్ వద్ద సమ్మక్క, సారలమ్మ జాతర ప్రాంగణంలో సోమవారం ఆయన కొబ్బరికాయ కొట్టి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. జాతర పరిసరాలను మట్టితో చదును చేయాలని సింగరేణి అధికారులను కోరారు. దుకాణాలు, పోలీస్ కంట్రోల్, వార్, వైద్యం, మీడియాకు ప్రత్యేకంగా గదులు కేటాయించాలన్నారు. రోడ్డు వైపు కొట్టుకొచ్చిన బోటును క్రేన్ సాయంతో నదిలోకి తరలించాలని సూచించారు. శ్మశానవాటిక గోడ ఎత్తు పెంచాలన్నారు. అమ్మవార్ల గద్దెలకు టైల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పుష్కరఘాట్–మెట్ల మధ్య ఫ్లోరింగ్ చేయించాలని, షెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదకరంగా విద్యుత్ కనెక్షన్లు ఉండొద్దని అన్నారు. గద్దెలకు అమ్మవార్లు వచ్చే సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది తాళ్లతో రక్షణగా ఉండాలని సూచించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు వాణిజ్య, వ్యాపార, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని అధికారులను కోరారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రధానంగా పారిశుధ్యం నిర్వహణ, సిబ్బంది నియామకం, వాహనాలు సమకూర్చడంలో ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. శివుని విగ్రహం చుట్టూ పొదలు తొలగించాలని, రంగు బొమ్మలతో గోడలు సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. మేడారం తరహాలో శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని చెప్పారు. సమ్మక్క జాతరకు వైభవం తీసుకురావడంతోపాటు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి సింగరేణి సంస్థ చొరవ తీసుకోవాలని అన్నారు. కార్పొరేటర్లు ధాతు శ్రీనివాస్, మహంకాళి స్వామి, ముస్తఫా, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ నాగేశ్వర్, సింగరేణి ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్, ఎన్టీపీసీ అధికారి సూర్యనారాయణ, ఆర్ఎఫ్ సీఎల్ అధికారి వంశీకృష్ణ, సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాదరావు, టాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్, దేవాదాయ శాఖ అధికారులు సుజాతారెడ్డి, కాంతారెడ్డి, జాతర కమిటీ చైర్మన్ పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ గోదావరిలో పడవ నడిపారు. అధికారులు, పాత్రికేయులు ఎక్కి కాసేపు నదీలో విహారం చేశారు.



గోదావరి నదిలో పడవ నడుపుతున్న ఠాకూర్



జాతర కమిటీ, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

క్లుప్తంగా

దుకాణంలో అగ్నిప్రమాదం

గోదావరిఖని: స్థానిక మేదరిబస్తీ సమీపంలోని శిల్ప ఎలక్ట్రికల్ షాపు పైఅంతస్తులో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. భారీగా పొగలు రావడంతో స్థానికులు గమనించి ఫైరింజన్‌కు సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత



నోటీసు అందిస్తున్న నాయకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఫిబ్రవరి 16న చేపట్టే సార్వత్రిక సమ్మెకు రైస్‌మిల్లు గుమస్తాల సంఘం మద్దతుగా నిలుస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు తెలిపారు. ఈమేరకు రైస్‌మిల్లు ఓనర్లకు సమ్మె నోటీసు అందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని పుసాల రైస్ మిల్లు అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లు ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు తాండ్ర అంజయ్య, గుమస్తాల సంఘం అధ్యక్షుడు మాతంగి రాయమల్లు పాల్గొన్నారు.

డంప్‌మెన్, ట్రిప్‌మెన్ రాత పరీక్ష



పరీక్ష పేపర్ సీల్ తొలగిస్తున్న జీఎం

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియాలో డంప్‌మెన్, ట్రిప్‌మెన్ రాత పరీక్షను సోమవారం యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి స్కూల్‌లో నిర్వహించారు. పరీక్షను జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పర్యవేక్షించారు. మొత్తం 3 ఖాళీలకు 107 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 93 మంది రాత పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష అనంతరం ఫలితాలను ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, డీవైపీఎంలు వేణుగోపాల్, వంశీధర్, సీనియర్ పీవో సురేందర్, సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహ్మద్ పాల్గొన్నారు.

పూసాల గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ మృతి



గట్టయ్య(ఫైల్)

సుల్తానాబాద్(పెద్దపల్లి): మున్సిపల్ పరిధిలోని పుసాల మాజీ సర్పంచ్ మాటేటి గట్టయ్య(62) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతదేహాన్ని సుల్తానాబాద్‌కు తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పుర ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

రామగుండం టు కోల్‌కతా

- వలస కూలీలకు ఉపాధి మార్గం
- జిగురు సేకరణతో ఆదాయం
- పొట్ట నిండాలంటే పొద్దంతా సేకరించాల్సిందే..
- దురిసేను చెట్టు కొమ్మల నుంచి జిగురు సేకరిస్తున్న వలస కూలీలు



ఎన్టీపీసీలోని చెట్ల కొమ్మల నుంచి కోల్‌కతావాసులు సేకరిస్తున్న జిగురు ఇదే..

జ్యోతినగర్(రామగుండం): పొట్ట కూటి కోసం అలుపెరగకుండా పొద్దంతా పనిచేస్తున్నారు. ఇక్కడ కాదు.. అక్కడ కాదు.. ఏకంగా కోల్‌కతా నుంచి వచ్చిన వలస కూలీలు జిగురు సేకరిస్తూ కుటుంబాలను సాకుతున్నారు. ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు నుంచి రింగ్ రోడ్డు వరకు కొత్తగా రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో దానికి పక్కన ఉన్న భారీచెట్లు పనులకు ఆటంకం కలిగిస్తున్నాయి. దీంతో కాంట్రాక్టర్ చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టారు. ఈ పనులే వలసకూలీలకు ఉపాధి మార్గంగా మారింది.

జిగురు ఇస్తున్న దురిసేను చెట్లు

- రోడ్డు నిర్మాణం కోసం తొలగిస్తున్న దురిసేను చెట్ల కొమ్మల నుంచి జిగురు పెద్దమొత్తంలో జిగురు కారుతోంది. ఈవిషయం తెలుసుకున్న కోల్‌కతాకు చెందిన ముగ్గురు కొమ్మలను ఒక చోట చేర్చి వాటి నుంచి కారుతున్న జిగురు సేకరిస్తున్నారు. దీనిని కోల్‌కతాకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. కేజీ జిగురు రూ.120 ధర పలుకుతోందని వలస కూలీలు చెబుతున్నారు.

దురిసేను చెట్టుతో లాభాలు..

- దిరిసెన(దురిసేను) చెట్టును సంస్కృతంలో మృదుపుష్పి, శిరీష అని పిలుస్తారని శాస్త్రవేత్తలు, ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో భాగి చెట్టు, సిరిసిమి చెట్టు అని కూడా పిలుస్తారని అంటున్నారు. ఈ చెట్టును పూర్వకాలం నుంచి ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తున్నారని పేర్కొంటున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసినా నయంకాని వ్యాధులను దురిసేన చెట్టు ఆకులు, జిగిరు, వేళ్లతో తయారుచేసే మందులు నయం చేస్తున్నాయని స్థానిక ఆయుర్వేద వైద్యులు వివరిస్తున్నారు.

ఉపాధి దొరుకుతంది



రోడ్డు పనులకు అడ్డుగా ఉండడంతో దురిసేను చెట్లు తొలగిస్తున్నరు. వాటి కొమ్మల నుంచి మేం జిగురు సేకరిస్తున్నం. దీనిని కోల్‌కతా మార్కెట్‌కు తరలిస్తున్నం. అక్కడ కేజీ జిగురు రూ.120 వరకు ధర పలుకుతున్నది. ఇలా విక్రయిస్తూ వచ్చిన సొమ్ముతో మా కుటుంబాలను సాకుతున్నం.

– కిరణ్, వలస కూలీ, కోల్‌కతా

షూ పాలిష్ చేయొచ్చు



దురిసేను చెట్టు కొమ్మల నుంచి వచ్చే జిగురు సేకరించి కోల్‌కతాకు తీసుకెళ్తున్నం. దీనిని షూ పాలిష్ తయారీలో ఉపయోగిస్తున్నరు. ఆయుర్వే మందుల్లోనూ వినియోగిస్తున్నరని డాక్టర్లు చెబుతున్నరు.

– అస్మా ఉల్, వలస కూలీ, కోల్‌కతా

ఆర్థికాభివృద్ధి



ఎన్టీపీసీలో రోడ్డు పనుల కోసం దరిసేను చెట్లు తొలగిస్తున్నరనే సమాచారంతో ఇక్కడకు వచ్చినం. వాటి కొమ్మలకు ఉన్న జిగురు సేకరించడం మా పని. పెద్దకొమ్మలకు ఉన్న జిగురు పుల్లలు సేకరిస్తున్నం. పుల్లలు, జిగురును కత్తితో వేరుచేస్తున్నం. ఇందులోని జిగురు సేకరించి కోల్‌కతాకు పంపించి అమ్ముకుంటున్నం. మిగతా రోజుల్లో కూలీ పనులు చేసుకుంటం.

– అజారం షేక్, వలస కూలీ, కోల్‌కతా

కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయండి

- సింగరేణి ఏరియా ఆస్పత్రి ఎదుట కార్మికుల ధర్నా



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్



ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు, మద్దతు తెలుపుతున్న నాయకులు

గోదావరిఖని: జీడీకే– 2ఏ గనిలో జరిగిన ప్రమాదంలో మరణించిన మైనింగ్ సర్దార్ సమ్మిరెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక ఏరియా ఆస్పత్రి ఎదుట కార్మికులు సోమవారం ఆందోళనకు దిగాయి. మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి ఆస్పత్రి ఎదుట ఉంచి సుమారు మూడు గంటల పాటు ధర్నా చేశారు. నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, యాదగిరి సత్తయ్య, తుమ్మల రాజారెడ్డి ఆందోళనకారులకు మద్దతు పలికారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య సీ ఎండీ బలరాం, డైరెక్టర్(పా) శ్రీనివాస్, పర్సనల్ జీఎం హన్మంతరావుతో ఫోన్‌ద్వారా చర్చలు జరిపారు. మృతుడి కుమారుడికి బీటెక్ ఫోర్‌మెన్ ట్రెయినీగా ఉద్యోగం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని సీతారామయ్య తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ధర్మపురి, సదానందం, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, సంకె అశోక్ పాల్గొన్నారు. అనంతరం పార్థీవదేహాన్ని మృతుడి స్వగ్రామం వరంగల్ జిల్లాలోని దస్తగిరిపల్లెకు తీసుకెళ్లారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

గని ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్య తీసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ డిమాండ్ చేశారు. సమ్మిరెడ్డి మృతదేహాన్ని ఆయన ఆస్పత్రి వద్ద సందర్శించి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబంలోని ఒకరికి సూటబుల్ ఉద్యోగం ఇప్పించాలన్నారు. సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ రక్షణపై లేదని విమర్శించారు. ఆయన వెంట కార్పొరేటర్ ముస్తాఫా, నాయకుడు పాతిపెల్లి ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

నకిలీ వీసాలతో మోసం చేసిన వ్యక్తిపై మరో కేసు

మెట్‌పల్లి(కోరుట్ల): దుబాయ్‌లో ఉద్యోగాల పేరుతో ఏలేటి రమేశ్ నకిలీ వీసాలు ఇచ్చి మోసానికి పాల్పడ్డాడని పలువురు ఫిర్యాదు చేయగా పోలీసులు ఇటీవల కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఖానాపూర్ మండలం బాదనకుర్తికి చెందిన మర్రి రాజేశ్, మెట్‌పల్లికి చెందిన శివకుమార్ తమ వద్ద రూ.97,500 తీసుకొని రమేశ్ నకిలీ వీసాలు అందించాడనే ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు మరో కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో మనోజ్‌గౌడ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): యాద్రాది – భువనగిరి జిల్లాలో ఫిబ్రవరి 3, 4వ తేదీల్లో నిర్వహించే 6వ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు పలువురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ రగ్బీ పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. బాలుర విభాగంలో 30 మంది, బాలికల విభాగంలో 20మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారని వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు అంతటి శంకరయ్య, ప్రతినిధులు దేశెట్టి నరేశ్, బొల్లి సత్యనారాయణ, ఆకుల అజయ్, ఇక్బాల్, ఎల్లే రాజు, శివ, వెంకటేశ్, ముస్తఫా, సిద్ధ తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మృతుడికి నివాళి

పెద్దపల్లిరూరల్: జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏవోగా పనిచేసే సుధీర్‌కుమార్ హఠాన్మరణం పొందారు. సోమవారం టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన ఆత్మకు శాంతికలుగాలని ఆకాంక్షించారు. అడిషనల్ కలెక్టర్లు శ్యామ్‌ప్రసాద్‌లాల్, అరుణశ్రీతోపాటు పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, రంగంపల్లికి చెందిన పాత్రికేయుడు పూదరి వెంకటేశ్ తండ్రి రాజేశం అనారోగ్యంతో మరణించగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే విజయరమణారావు సోమవారం వెంకటేశ్‌తోపాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కిరాణాల్లో అధికారుల ఆకస్మిక తనిఖీలు

- 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



కిరాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణంలోని పలు కిరాణాల్లో రెవెన్యూ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కిరాణా వ్యాపారులు రేషన్ బియ్యం విక్రయిస్తున్నారని కొందరు స్థానిక నాయకులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని కిరాణా వ్యాపారులు ఒడిశా కార్మికులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అందుకే సోదాలు చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఏడు కిరాణాల నుంచి 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని అన్నారు. వారి సిఫారసు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు శ్రీవాణి, స్వాతి పాల్గొన్నారు.





రాజన్నకు భక్తజన జాతర

వేములవాడ: రాజన్నకు సమ్మక్క జాతర భక్తుల రద్దీ పెరిగింది. సోమవారం 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టింది. భక్తుల ద్వారా రూ.60లక్షల వరకు ఆదాయం సమకూరింది. భక్తుల రద్దీ పెరిగిపోవడంతో ఆలయ అధికారులు ఆర్జిత సేవలను రద్దు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోల నుంచి తొలగించిన అదనపు సీట్లు

కరీంనగర్‌క్రైం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ సూచించారు. సోమవారం కరీంనగర్ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసులు బస్టాండ్ ఇన్ గేట్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దాదాపు 100కు పైగా ఆటోల నుంచి అదనంగా పరిమితికి మించి డ్రైవర్ పక్కన ప్రయాణికులు కూర్చునేలా అమర్చిన సీట్లు, మ్యూజిక్ సిస్టం, ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా అమర్చిన పరికరాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని సూచించారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన ఆటో డ్రైవర్లను గుర్తించడమే కాకుండా వారికి ఈ చలాన్ ద్వారా జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. ఇక నిరంతరం స్పెషల్‌డ్రైవ్‌లు కొనసాగుతాయని వివరించారు. ఆటో డ్రైవర్లే కాకుండా ఇతర వాహనదారులు కూడా నియమాలు పాటిస్తూ, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సబ్ ఇన్‌స్పెక్టర్లు రాజు, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

జరిమానా చెల్లింపులపై వాహనదారుల ఆసక్తి



సుల్తానాబాద్ సర్కిల్‌లో నమోదైన కేసులు

	పీటీ కేసులు	డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
సుల్తానాబాద్	2439	681
పోత్కపల్లి	1405	149
జూలపల్లి	518	100
కాల్వశ్రీరాంపూర్	1095	120

జరిమానాలు

లారీలు : 50	జరిమానా చెల్లించినవి 2,094
ద్విచక్రవాహనాలు 1,560	
కార్లు : 1,002	చెల్లించిన మొత్తం జరిమానా రూ.10,47,000
ఇతర : 5,102	

సుల్తానాబాద్(పెద్దపల్లి): ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై విధించిన జరిమానాలు చెల్లించడంపై వాహనదారులు దృష్టి సారించారు. సుల్తానాబాద్ సబ్ డివిజన్‌లో సుల్తానాబాద్, జూలపల్లి, కాల్వ శ్రీరాంపూర్, పొత్కపల్లి ఉన్నాయి. ఈ మార్గాల్లో రాకపోకలు సాగిస్తూ నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై పోలీసులు జరిమానా, చలాన్లు విధించారు. పీటీ కేసులు నమోదు చేశారు. అయితే, పోలీసు శాఖ చెల్లింపులపై గతనెల 26 నుంచి భారీ రాయితీ అమలు చేస్తోంది. ద్విచక్ర వాహనాలపై 80శాతం, కార్లపై 60, భారీ వాహనాలపై 50, ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90 శాతం రాయితీ వర్తింపజేస్తోంది. దీంతో గడువు లోగా చలాన్లు, జరిమానా చెల్లించేందుకు వాహనదారులు ఆసక్తి చూపుతున్నారు.

ప్రధాన సమస్యలపై దృష్టి సారించండి

- పట్టణ ఆర్యవైశ్యుల విన్నపం



శాలువాతో సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

రామగుండం: పట్టణంలోని ప్రధానమైన సమస్యలు పరిష్కరించాలని పలువురు ఆర్యవైశ్యులు కోరారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సోమవారం పట్టణంలో పర్యటించారు. ఆయనను ఆర్యవైశ్యులు శాలువాతో సత్కరించారు. డ్రైనేజీ, భూగర్భ మురుగునీటికాలువలు నిర్మించాలని, అంబేడ్కర్ కూడలి నుంచి లింగాపూర్ గోదావరి నది వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని, డబుల్ రోడ్డు నిర్మించాలని, శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి పాటుపడాలని, ఆలయ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, బీ–థర్మల్ స్థలంలో కొత్త విద్యుత్ కేంద్రం స్థాపించి తమకు పరోక్షంగా జీవనోపాధి కల్పించాలని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తాటిపెల్లి శివకుమార్, ప్రతినిధులు కట్కూరి ఆత్మలింగం, పల్లెర్ల అంజయ్య, దొంతుల వైకుంఠం, పాత శ్రీనివాస్, ధనుంజయ, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పాలకుర్తి(రామగుండం): రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో పర్మినెంట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, కేశోరాం కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై తనకు పూర్తిఅవగాహన ఉందని, వాటిని పరిష్కరిస్తామని అన్నారు. కేశోరాం కార్మికుల ఉద్యోగ విరమణ వయస్సు 61ఏళ్లవరకు పెంచేలా కృషి చేయాలని పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పూలమాల, శాలువాతో ఆయనను సత్కరించారు. కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో నాయకులు దాడి మహేశ్, ముక్కెర శ్రీనివాస్, దేవనందుల రాజమౌళి, ఉరిమెట్ల రాజలింగం, నగునూరి రమేశ్, మేకల నర్సయ్య, రావుల నారాయణ, పొన్నం సత్తయ్య పాల్గొన్నారు. కొత్తపల్లిలో కాంగ్రెస్ నాయకులు రాజ్‌ఠాకూర్‌కు ఆత్మీయసభ నిర్వహించారు. ఆయనను పూలమాల, శాలువాతో సత్కరించారు.

శేష జీవితం ఆరోగ్యంగా ఉండాలి

- జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు



జీఎంలను సన్మానిస్తున్న అధికారులు

రామగిరి(మంథని): ఉద్యోగ విరమణ చేశాక శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎస్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్.సాంబయ్య, క్వాలిటీ ఏజీఎం పి.ప్రసాదరావు ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక జీఎం కార్యాలయంలో సోమవారం వారికి ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఘనంగా సన్మానించారు. సింగరేణి సంస్థలో 42ఏళ్లుగా నిబద్ధతతో విధులు నిర్వర్తించిన సేఫ్టీ జీఎం సాంబయ్య, 35ఏళ్లుగా పనిచేస్తున్న పి.ప్రసాదరావు సేవలు ప్రశంసనీయమన్నారు. వారు మందికి ఆదర్శమని పేర్కొన్నారు. ఎస్‌వోటూ జీఎంలు జి.రఘుపతి, డి.బైద్య, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారులు ఎస్.రాధాకృష్ణ, ఎస్.రమేశ్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్ వెంకటరమణ, సర్వే అధికారి జైనాలాబద్దీన్, సివిల్ డీజీఎం పద్మరాజు, సీహెచ్‌పీ డీజీఎం కాశీవిశ్వేశ్వర్‌రావు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీడీకే–1వ గనిలో ప్రమాదం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–1, 3గనిలో సోమవారం ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బి.సునీల్ అనే జనరల్ మజ్దూర్ గాయపడ్డాడు. గనిలోని పనిస్థలంలో సైడ్‌ఫాల్‌అయి బొగ్గు పెల్లపడి కుడి కాలికి గాయాలయ్యాయి. వెంటనే సునీల్‌ను సింగరేణి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): క్రీడలతో విద్యార్థుల్లో మానసికోఉల్లాసం కలుగుతుందని ఏఐటీయూసీ ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్, భారత జాగృతి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కండెం సురేశ్ అన్నారు. సోమవారం స్థానిక అబ్దుల్ కలాం స్టేడియంలో ధ్రువ పాండవ క్రికెట్ క్లబ్, భారత జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన క్రికెట్ టోర్నీని వారు ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. సింగరేణి, శాంతినికేతన్, స్పందన మోడల్, వెంకట్రావుపల్లి ప్రభుత్వ, కృష్ణవేణి, శ్రీవాణి పాఠశాలలకు చెందిన ఆరు జట్లు పోటీలకు హాజరయ్యాయి. విన్నర్‌గా నిలిచిన సింగరేణి స్కూల్ విద్యార్థుల జట్టుకు విన్నర్ కప్, రన్నర్‌గా నిలిచిన శాంతినికేతన్ పాఠశాల జట్టుకు రన్నర్స్ కప్ అందజేశారు. ప్రతినిధులు నర్సింహారెడ్డి, రవీందర్, వేణుగోపాల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

జగిత్యాలక్రైం: పోచమ్మవాడకు చెందిన గడ్డం అనూష (27) చికిత్స పొందుతూ మృతిచెందింది. అనూషను నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన గడ్డం హరీశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. తరచూ కడుపునొప్పితో బాధపడుతున్న అనూష మనస్తాపంతో ఈనెల 27న ఉరేసుకొంది. ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతిచెందింది.